# మళ్ళీవస్తా

నెలరోజులుగా ఎండా వాన దాగుడుమూతలు ఆడి నిన్నగాక మొన్న ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చిప్ అన్నట్టు సముద్రం మీరికి పారిపోయేసరికి.

ఇంతకాలం నల్లని మబ్బులు గుంపులు గుంపులు.

తెల్లని కొంగలు బారులు బారులు.

అవిగో అవిగో అంటూ కూనిరాగులు తీస్తూ హాయిగా అర్ధమండలం పాటు ఆఫీసు పని మానేసి విశ్రాంతాగా వున్న సూర్య భగవానుడికి ఎక్కడలేని చికాకు కలిగింది.

"వాతావరణం పోడిగా వుంది పగలు ఒకమాదిరి ఎండ నుంచి మండుటెండ వరకూ కాయవచ్చు, రాత్రి పూట మామూలుగా చీకటిగా వుంటుంది. ఈ పున్నమినాడు వెన్నెల కనపడుతుంది "అని అంటూ వార్తా పత్రికలు ఆశరీర వాణులు అదేపనిగా రోధ పెడుతుంటే,

సూర్య భగవానుడు ఎ.సి. రూములో రాకింగ్ చైర్‌లో కూర్చొని స్కాచ్ విస్కీ అరగా అరగా పుచ్చుకుంటూ టి.విలో సినిమా చూస్తూ కాలం గడుపుతూ వుంటే డిపార్టుమెంటు ఆఫ్ టైమ్‌నుంచి టెలెక్స్ మెసేజ్ వచ్చింది. అది కూడా సగం సంస్కృతంలో సగం ఇంగ్లీషులో: "కాలే తపతి సూర్యం: హాలిడేస్ ఓవర్ డ్యూటీ ఫస్టు. కీప్ మూవింగ్!".

సూర్య భగవానుడికి ఈసారి నిజంగానే కోపం వచ్చింది. సగం చదివిన సీరియల్ కథ దూరంగా పారేశాడు. స్కాచ్ విస్కీ సీసా మూత బిగించి వేశాడు. టి.వి దీపం ఆరిపేశాడు. ఎ.సి. రూంలోంచి బయటకు వచ్చాడు.

నాయినా అనూరువ అంటూ కేకపెట్టాడు. రధసారధికి ఈ పిలుపువినిపించింది. కాని విననట్లుగా నటిస్తూ చేతితో నడిసే మూడు చక్రాల సైకిలు తొక్కుకుంటూ టెన్నిస్ కోర్టుచుట్టు తిరుగుతున్నాడు.

రెండో పిలుపు విని అప్పుడే విన్నట్లు నటించి. సైకిలు తొక్కుకుంటూ దగ్గరకు వచ్చాడు.

దీన్ని ఎక్కడనుంచి సంపాదించావు!" అని దినకరుడు అడిగాడు.

"చెప్పాలంటే చాంతడంత కథ అవుతుంది"

ఆదిత్యుడి ముఖంలో రవ్వంత చికాకు కనిపించింది. "మనం ఏ శతాబ్దంలో వున్నాము" అని ప్రశ్నించాడు.

అనూరవుడు తడుముకోకుండానే సమాధానం చెప్పాడు' "శ్వేత వరాహ కల్పే - వైవశ్వత మన్వంతరే - కలియుగే ప్రథమ పాదే" అంటూ చెప్పుకు పోతున్నాడు.

అక్కడికి ఆపుబాబు నేను అడిగింది క్రీస్తుశకం ఎన్నో శతాబ్దం? అని.

"క్రీస్తుశకమా!" అంటూ సారధి ఆలోచనలో పడ్డాడు.

అదేరా నాయినా చిన్నప్పుడు హిస్టరీ క్లాసులో చదువుకోలేద్దు. ఎ.డి.బి. సి అని అనూరువుడు తన సైకిలువంక చూసుకుంటూ నాది కంపోజిట్ మేథ్స్ అని అన్నాడు.

దివాకరుడు నెత్తి నెత్తి కొట్టుకుని మీరంతా నా ఖర్మకొద్దీ దొరికారురా" దిస్

ఈజ్‌ది ట్వంటీయత్ సెంచరీ ఆఫ్ అన్నాడామినీ ఆ మాత్రం తెలియదా" అని అన్నాడు.

వాడు బిక్కముఖం వేసి "దేనికండీ పొద్దున్నే తిడతారు" అని అడిగాడు.

తరణికి నిజంగానే నవ్వు వచ్చింది. నిన్ను తిట్టడంలేదురా నాగన్న నా అదృష్టానికి సంతోషిస్తున్నాను. ఇది నాగరికత బలిసిన కాలం. బ్రహ్మ సృష్టికి ప్రతి సృష్టి చెయ్యగల, విశ్వామిత్ర యుగం . అందుకని పల్లెటూరి బైతులాగా చాంతాడు గింతాడు జాంతానయి నైలాన్ రోప్ సే నైలాన్ రోప్ అంతకథ అనాలి. తెలిసిందా ఏమనాలో చెప్పు.

చాంతాడు అని అనకూడదు నైలాన్ రోప్ అంత కథ అని అనాలి.

దట్స్‌రైట్ నేను చెప్పినట్టు అలా వింటే సురేంద్రానాథ్ బెనర్జీ అంతటి వాడిని చేస్తాను.

అనూరవుడు పకపకా నవ్వి "గ్రంధచౌర్యం। గ్రంధ చౌర్యం" అని అన్నాడు.

ఆ విషయానికి తరువాత వద్దాంగాని ముందు నీ సైకిలు కిస్సా ఏమిటో చెప్పు.

ఏదో ఒక భాషలో మాట్లాడండి ఇన్ని భాషలలో కలగూర గంపగా మాట్లాడితే నాకు అర్ధంకాదు. నాది అంతా సింగిల్ లాంగ్వేజీ గ్రూప్

సరేలే ఈ సైకిలు నీకు ఎవరు యిచ్చారు. దాని కధా కమామిషు చెబుతావా?

కథ అంటే అర్ధమైంది. కాని కమామిష్ అంటె !

కమామిష్ అంటే ఉరుదు భాషలో వివరములు ఆంగ్ల భాషలో అంటారు చూడు అదే డీటైల్స్.

"చెబుతాను సావధానంగా వినండి । వెనుక ఒకసారి అదేదో యుగంలో నైమిశారణ్యంలో శౌనకాది మునులు పరీక్షిత్ మహా రాజుతో ఏమన్నారంటే ...

"ఏమన్నారో అదంతా నాకు తెలుసు కాని ఈ సైకిలు నీకు ఎక్కడిది? ముందా విషయం చెప్పు"

నిజం చెప్పమన్నారా? అబద్ధం చెప్పమన్నారా?

నిజమే చెప్పి అఘోరించు అబద్ధం చెబితే ఏం జరుగుతుందో నీకు తెలుసుగా!

బాబు నిజమే చెబుతానుగాని నావంక నిప్పులు కక్కేలా చూడటం మానేసి రవ్వంత శీతకన్ను వెయ్యండి.

నువ్వు నీసామొుతలనూ అసలు విషయం చెప్పిచావు !

మీ ఆజ్ఞ ప్రకారమే చెప్పే చస్తాను. అవధరించండి :

అవధరిస్తున్నాను ప్రారంభించు

ఈ నెలరోజులుగా డ్యూటీ లేకపోయేసరికి కాళ్ళంతా గుదుళ్ళుకట్టి మనస్సంతా బోర్‌కొట్టి అలా కాలక్షేపానికి బస్ ఎక్కాను. మన సిటీబస్‌ల సంగతి మీకు తెలుసుగా"

తెలుసుగాని అసలు విషయం చెప్పు

ఎక్కడో బయలుదేరి ఎక్కడికో చేరడానికి ముందుగా ఆ పల్లవనుడు

"పల్లవనుడా?" అతగాడెవడు? యక్ష కిన్నెర గంధర్వులలో ఏ తెగవాడు? చరిత్ర అడగవద్దు ! చెప్పిందివినండి అయినా మీరు పెద్దలు పైగా నాకు యజమానులు ఈసారికి చెబుతాను వినండి "పల్లవన్" అనేది బస్సు ట్రాన్సుపోర్టు కంపెనీ పేరు ఆ పల్లవనుడు నన్ను ఊరంతా తిప్పి పంచతార కర్పూర మండలం భవనం దగ్గర దింపాడు"

పంచదార కర్పూర మండలం ఏమిటిరా?

పంచదార కాదండి పంచతార! ఐదు నక్షత్రాల భవనం ! అదేనండి ఫైవ్‌స్టార్ హోటల్.

ఎందుకు దింపాడు?

దిగవలసి వచ్చింది.

ఎందుకు దిగవలసి వచ్చింది అంట?

బస్సు చెడిపోయింది కాబట్టి చచ్చినట్లు అంతా దిగాలి.

చచ్చినట్లు దిగడమేమిటి? చచ్చిన వాడు దిగుతాడా!

అలా తెలియనట్లు అడుగుతారేమండి జీవుడు ఈ శరీరం అనే పాతచొక్కాని వదిలిపెట్టి ఈ స్థూల శరీరానికి మరణమనే జడత్వాన్ని ఆపాదించి తిరిగి పంచభూతాలతో కలిసి పోయే అవకాశం కలిగేతే అప్పుడు సూక్ష్మ శరీరం భూమండలాన్ని దాటి అంటే అతల పితల దసాతల మహాతల పాతాళం వంటి అధోలోకాలు .

ఓం భువః సువః మాహోతపః సత్యం వంటి ఊర్ధ్వ లోకాలకు వెళ్ళడానికయినా మొదట్లో వై.డి. రాజుగారి కోర్టుకు వెళ్ళిగాని ఫైనల్ జడ్జిమెంటు పొందరు కాదుటండి.

నాయనా రామాయణంలో యీ పిడకలవేటాడటం దేనికికాని బస్సుదిగిన తువాత ఏం జరిగిందో చెప్పుబాబు.

"బస్సు దిగి ఎదురుగా చూసేసరికి కళ్ళు జిగేల్‌మన్నాయి. వందలు, వేల దీపాలు జ్వాలా తోరణాలు రంభా, ఊర్వశీ మేనక వగైరా అప్సరసలల్లాంటి సుందరాంగులు ఆ సుందరాంగులు ...."

నీకు ఎప్పుడూ ఆడవాళ్ళగోలే అసలు విషయం చెప్పు.

బస్సు స్టాప్‌లో ఉన్న నాయరు కొట్టు దగ్గరకు దేక్కుంటూ వెళ్ళాను.

వెళ్ళి ఏం చేశావు?

"నాయరు నాయరు ఇది ఏ ప్రాంతం నాయనా అలకాపురమా ? అమరావతా కైలాసమా" అని అడిగాను అన్నట్లు ఆ నాయరు ఎలా వున్నాడో చెప్పానా

ఎలా వున్నాడు.

వర్చసుగల ముఖం పెద్ద పెద్ద మీసాలు 'జాటా జూటింలాంటి హిప్పీ హెయిరు స్టయిలు చందమామకన్న తెల్లటి వీభూతి, మందారం కన్న ఎర్రని సింధూరం బొట్టు, అమృతం సేవించి మత్తుతో ఎరుపెక్కిన విశాల నేత్రాలు మొడలో సర్పం వంటికి గజ చర్మం లేదుకాని సాక్షాత్తు సదాశివుడి లాగా వున్నాడు.

ఆ వర్ణన వినేసరికి అంతేలేని ఆనందం కలిగి ఆదిత్యుడు

"హరః హరః మహాదేవ

శంభోశంకర అంటూ అంజలిఘటియించి బిగ్గరగా అన్నాడు.

అప్పుడే కాఫీ కలుపుకుని వచ్చిన భాయాదేవి నవ్వుతూ "శివ స్తోత్రం సాయింత్రం పూట" అని అన్నది.

దినకరుడు పరధ్యానంగానే యీ కప్పు అందుకుంటూ రవ్వంత తాగి కాఫీ

వంక చూశాడు. పంచదార కోటా అయిపోయిందో లేక ఆ సూర్యపత్ని మరిచిపోయిందో కాఫీ నల్లగా, చేదుగా కాలకూట విషంగా వుంది.

ఈ కాలకూట విషంవంక చూడగానే అప్రయత్నంగానే సూర్యుడు.

విశ్వేశ. విశ్వ భవనాశయి విశ్వ రూపా!

విశ్వాన్ మదః త్రిభువనైక గుణాభిషేక!

హే విశ్వబంధో! హే విశ్వబంధు కరుణామయ దీన బంధో !!

సంసార దుఃఖ గహనా జగదీశ రక్ష" అంటూ బిగ్గరగా పాడాడు.

రధ సారధి తనలో తాను అనుకుంటున్నట్లుగా "అంతా పంకజ్ మల్లిక స్టయిల్ అని అన్నాడు.

అదే సమయానికి కైలాసంమీద, శివయ్యగారు, పార్వతమ్మగారు! బ్రేక్‌ఫాస్టుకు ఉపక్రమించ బోతున్నారు. కుమార స్వామి ముఖం చిట్లించి

"ఈ టైమ్‌లోకూడా సుప్రభాతాలు ఈ చలిమిడి చిమ్మిరి సంగీతాలు వీళ్లాను. మంచి పాప్ మ్యూజిక్ పెట్టరాదా నైల్ డైమండ్ ABBA గ్రూప్ వాళ్ళ పాప్‌లు వస్తాయి కదా" అంటూ విసుక్కున్నాడు.

వినాయకరావు అటూఇటూ చూసి అది రేడియో పాట కాదురా తమ్ముడు అని అన్నాడు.

పార్వతమ్మగారు చిరునవ్వు నవ్వి "పొద్దున్నే మిమ్మల్ని తలుచుకుంటున్నారు" అని అంది.

ఉమాపతిగారు ఒక్కసారి ఛాతివిరుచుకుని "ఈ భోళాశంకరుడు భక్తజన సులభుడు అందు కనీ ...." అంటూ ఏదో చెప్పబోతుండగా కుమారస్వామి అడ్డం వచ్చి,

భక్త సులభులు కాబట్టే మిమ్మల్ని పొగిడిన ప్రతి రాక్షసుడికి వాడు పెట్టిన అన్ని షరతులకు వప్పుకుని వాడికి నచ్చిన వరం ఇవ్వడం - వాడు దాంతో శివవర ప్రసాదిని అంటూ వళ్ళూపయి తెలియకుండా తిరిగి మంచివాళ్ళని నానా అగచాట్లు పెట్టడం యీ గోలభరించలేక పాల సముద్రం మీద నుంచి ఆయనలేచి మళ్ళీ ఇంకొక వరం యివ్వడం.

"శివాయ విష్ణురూపాయ

"శివ రూపాయ విష్ణువే"అంటూ మీ ఇద్దరూ క్లోజ్ ఫ్రెండ్స్‌కాని యీ భక్తులు మాత్రం వైష్ణవం, శైవం, వీరశైవం అంటూ ఒకడి తల ఒకడు బద్దలుకొట్టుకోవడం !!

"నాయనా షణ్ముఖా" అంటూ గౌరీ శంకరంగారు ఏదో చెప్పబోయారు.

ఎక్స్‌క్యూజ్‌మి జస్ట్ ఎ మినిట్ ప్లీజ్ అంటూ గణపతి కూడా ఏదో చెప్పబోయాడు.

ఏమిటి గణపతిబాబు ముఖం అలా పెట్టావు రోజూ ఉండ్రాళ్ళు తినకూడదు నాయనా మా బాబువిగా ఈ పూట బ్రెడ్ రోస్టు తిను అంటూ కాత్యాయని బుజ్జగించపోయింది.

ఊరుకోనమ్మా తిండి విషయం తప్ప నాకు యింకొక సంగతి లేదంటావా! మీ ఆయన్ను ఒక ఇంపార్టెంట్ క్వశ్చన్ అడగాలి.

ఏమిటి బాబు ఆ ప్రశ్న?

మీకోసం తపస్సుచేయడానికి మీ దగ్గర నుంచి వరాలు పొందడానికి ఈఇరవయి శతాబ్దంలో కూడా రాక్షసులు అసురులు దైత్యులు వున్నారా? తారకాసురుడులాంటి వాళ్ళు ఐమీన్ భస్మాసురుడులాంటి వాళ్ళు

ద్వాపర త్రేతాయుగాలలా అవే రూపాలు, పేర్లు వుండకపోవచ్చును కానీ మంచివారిని పీడించుకుతినే రాక్షసులు అన్ని యుగాలలోను వుంటారు. నాయనా అన్నింటికన్నా విశేషం ఈ కలియుగంలో రాక్షసులకే బాధలు తక్కువ. పదవులు, అధికారాలు! సిరి సంపదలు ఎక్కువ.

"మరి దేవతలు? అని కుమారస్వామి అడిగాడు.

"దేవతలూ వున్నారు. కాని వాళ్ళ బ్రతుకులు సగటు మనుష్యలకంటే కనాకష్టం.' 'అని పార్వతీ దేవి చాలా బాధగా అంది.

ఇది చాలా గ్రేవ్ ఇన్ జస్టిస్ కాదమ్మా? ఈ అన్యాయానికి కారణం ఏమిటి?

పుణ్యం, మోక్షం, డబ్బు పెట్టి కొనుక్కోడానికి అవకాశం వున్నంతకాలం నీ ఆలయానికి వచ్చి దర్శనం చేసుకుంటానని అన్నంత మాత్రాన సకలపాపాలని హరించగల అవతార పురుషులుండగా ఈ అన్యామాలు ఈ అరాచకాలు ఇంతే నాయనా" అంటూ మేనా పుత్రి బాధగా అంది.

దక్ష యజ్ఞంనాడు వచ్చినంత ఆవేశం వచ్చి అపశుపతినాధుడు.

"విష్ణుప్రియా" దైవదూషణ ఎవరికీ క్షేమంకాదు జాగ్రత్త" అంటూ రంకెపెట్టాడు.

ఆ రంకెకు నందీశ్వరుడు హడిలిపోతే గజాననుడు! పర్వత రాజ.పుత్రి నిరుత్తరులయి చిత్రాలులాగి నిలచిపోతె. కుమారస్వామి మాత్రం చిరునవ్వుగా "టేక్ఇట్ ఈజి భాస్", అజ్ఞానులు వాళ్ళమీదనా మీ కోపం" అంటూ తన క్వార్టర్సుకు వెళ్ళిపోయాడు.

శివయ్యగారు తనలో తాను నవ్వుకున్నట్లుగా "ఫూల్స్! డామ్ ఫూల్స్" అని మళ్ళీ అంతలోనే "ఈ మధ్య మాటమాటకి ఊరికినే విపరీతంగా కోపం వస్తుంది. బి.పి. ఏమన్నా పెరిగిందేమో ఒకసారి చూపించుకోవాలి" అని అనుకొని మెడలోని పాము సరిచేసుకుని తలమీద గంగమ్మను చంద్రవంకను సరిదిద్దుకుని గజచర్మం దులుపుకుని నంది వాహనం ఎక్కి డా॥ అశ్వనీదేవత గారి నర్సింగ్ హోమ్ పద నాయనా" అని అన్నాడు.

మీరెన్ని సార్లు స్తోత్రాలు చదివినా లాభం లేదండి శివయ్యగారూ సాయంకాలంపూట తప్ప ఎవరిమాట వినిపించుకోరు. ఆయన ఉత్తనైట్ బర్డు ధ్యానముద్ర మానేసి జాగృతిలోకిరండి. అని భాయాదేవి అనగానే సూర్య భగవానుడు ఉలిక్కిపడి అంతలోనే తెప్పరిల్లుకుని "సరే గుర్రాలు తీసుకువచ్చి బండికట్టు డ్యూటీకి పోదాం అన్నాడు.

"గుర్రాలా? మరేమో గుర్రాలా అండి" అంటూ అనూరవుడు నీళ్ళు నమలడం మొదలుపెల్లాడు.

గుర్రాలే ! గుర్రాలు తీసుకుని రమ్మంటే అలా వెర్రివాజమ్మ ముఖం వేస్తావే?

"గుర్రాలండి... మరేమోనండి... అబ్బాయిగారండి బెంగుళూరు రేసెస్‌కు తీసుకు వెళ్ళారు.

బెంగుళూరు రేసెస్‌కా దేనికి?

ఎలాగో ఖాళీగా వున్నాయి కదా. రేసులలో గెలిస్తే నాలుగు డబ్బులు సంపాదిచుకోవచ్చునని తీసుకు వెళ్లారండి.

అఘోరించి నట్లుగానే వుంది. ఈ తెలివితేటలు ఎవరివిరా! పెద్దబ్బాయివా, చిన్నబ్బాయివా ?

పెద్దబ్బాయిగారేనండి చిన్నబ్బాయి గారికి అటువంటి సరదాలు లేవండీ

యమలోకంలో పని చూసుకోవడం లేకపోతే ఏ సావిత్రమ్మగారి భర్త ప్రాణాలకోసమనో దున్నపోతులమీద బయలుదేరడం. అంతేనండి.

అయితే ఇదంతా ఆ శనిగాడి పనేనంటావు? ఎక్కడ అఘోరిస్తున్నాడో ఏమో.

పిలిచావా తండ్రీ అంటూ శని అక్కడికి దాపురించాడు.

పిలవలేదురా నాయనా ! మొత్తుకుంటున్నాను. ఆ దినకరుడి ఉత్తమ అశ్వాలని రేసులలో పరుగెత్తిస్తావా! ఇది ఏనాడన్నా మన ఇంటివంటా వున్నపనేనా ఇంతకూ ఏమాత్రం సంపాదించావు? డబ్బు ఏం చేశావు?

శని పెద్దపెట్టున నవ్వాడు,"నా చేతపడ్డ తర్వాత అవి గెలవడం కూడానా! పరుగెత్తండి ర్రా బాబూ అని నేను బ్రతిమాలితే యుగయుగాలుగా పరిగెత్తున్నది చాలు మేము కూడా రేసులు చూస్తామని వి.ఐ.పి ఎన్‌క్లోజర్‌లోకి పోయి కూర్చున్నాయి. రాను పోను ట్రాన్స్‌పోర్టు ఖర్చులు అయ్యాయి. ఓ.కె ఓ.కె... ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. రధం ఆయత్తం చెయ్యి నాయనా,

అనూరవుడు ఒక్క క్షణం తటపటాయించి గుర్రాలు చాలా అలసిపోయాయండి. వాటిని మాలీష్ అదీచేసి సాఫ్ చెయ్యాలి. కళ్ళాలు అవి ఈ చెమ్మకు బూజు పట్టాయి. వాటిని పాలీష్ చెయ్యాలి. రధంమీద రేపు బయలుదేరుదాం.

మరి ఈ రోజు !

ఈరోజుకేముంది నా సైకిలు మీద అవును నాయనా నీ క్రొత్త సైకిలు సంగతి మరచిపోయాను. ఆయనెవరో పల్లవన్ అనే ఆయన యిచ్చాడన్నావు కదూ!

ఆయన కాదండి.

మరి ఎవరు యిచ్చారు?

అదేదో క్లబ్‌వాళ్ళు. కాళ్ళు లేని వాళ్ళకు యిటువంటి సైకిళ్ళు ఇవ్వడం వాళ్ళు నెలనెలా చేసే పుణ్యకార్యాలలో ఒకటట. ఏ కారణంగానో అసలు రావాలసిన కుంటివాడు రాక తికమక పడుతూ వుంటే ఎదురుగా నేను కనిపించాను. దాంతో వాళ్ళు ఏనుగెత్తినంత సంబరపడి దిస్ క్రిప్పిల్ ఈజ్ గాడ్ సెండ్ - రియల్లీ గాడ్ సెండ్ ! అని వాళ్ళనివాళ్ళు అభినందించుకున్నారు. ఇద్దరు పెద్దమనుషులు నన్ను ఎత్తుకుని లోపలికి తీసుకుని వెళ్ళారు. మెళ్ళో దండవేశారు. ఒక మూసిన కవరు నా చేతిలో పెట్టారు సైకిలు మీద కూర్చోపెట్టారు. ఆయనెవరో ఒక పెద్దాయన మైక్ వంక టి.వి. కెమెరా వంక చూస్తూ యువర్ డైలీ టావెల్ విల్ బి ఎ ప్లజర్ అని అన్నాడు. ఇంతమంది సరదాకి వాళ్ళ మంత్లి ప్రాజెక్టును చెడగొట్టటం దేనికని వాళ్ళందరికి థ్యాంక్స్ చెప్పి సైకిలు పట్టుకుని వచ్చాను అందుకని.

"అందుకని యీ రోజు నీ సయికిలు మీద వెడదాం అంటావు. సరేపద" ఛాయాదేవి వంక చూసి బై బై డార్లింగ్ అని అన్నాడు.

ఆవిడ అలవాటుగా గుమ్మందాకా వచ్చింది "ప్రొద్దుపోయేదాకా అక్కడ ఇక్కడ తిరక్క పెందారాడే యింటికి రండి అసలే శీతాకాలం రోజులు. మీకు చలిగాలి పడదు' అని అంది.

జస్ట ఏ మూమెంట్ ప్లీజ్! అంటూ శని ఎదురు వచ్చాడు.

ప్రొద్దున్న దుశ్శకునం అంటూ ఇద్దరూ ఒక్క క్షణం ఆగారు, సూర్యడు ఏడుగుర్రాల రధంమీద వెడుతున్న ఐసిఐ క్యాలెండరు సయికిలుయందు ఫోర్క్‌కు తగిలించి గెట్ సెట్ గో! అని ఈలవేశాడు.

సూర్యుని జయిత్ర యాత్ర ఆనాటికి ప్రారంభమయింది.

కొండలు గుట్టలు దాటి దినకరుడు సోమిదేవమ్మగారి మేడమీదకు వచ్చాడు.

దివాకరుడికి ఆవిడంటే చాలా యిష్టం. తన దర్శనం కానిదే ఆవిడ ఇన్ని సంవత్సరాలు ఏనాడు ఇన్ని పచ్చిమంచినీళ్ళు కూడా తాగదు.

సముద్రంలోంచి ఉదయించిన సూర్యుడిని చూడగానే అమిత సంతోషంతో

మేలుకో శ్రీ సూర్యనారాయణ.

మేలుకో శ్రీహరి సూర్యనారాయణ

ఉదయిస్తూ బాలుడు ఉల్లిపండు భాయ.

ఉల్లిపండుమీద ఉద్దంపు పొడిచాయి అంటూ పాడడం మొదలుపెట్టింది.

"ఉల్లిపండుమీద ఉద్దంపు భాయ" అని సూర్యుడు తనలో తను అనుకొని - యీ పాట నీకు అర్ధమయిందా అంటూ డ్రైవర్‌ను అడిగాడు.

భక్తులపాటలకీ వ్యాఖ్యానం చేయటం మొదలుపెట్టామంటే ఒక్క అంగుళం కూడా ముందుకు కదలలేము.

"మీరు కనిపించారుగా ఇహ క్రిందకు వెళ్ళి టిఫిన్ తింటుంది లెండి" అంటూ హెచ్చరిక చేశాడు.

ఉదయభానుడి చూపు డాబామీద నుంచి సెకండ్ ఫ్లోర్ బెడ్ రూమ్‌లోకి వెళ్లింది.

కళ్ళు తెరిస్తే ఎక్కడ ఆఫీసుకు వెళ్లవలసివస్తుందేమోనని హాంగోవర్‌లో నిద్దర నటిస్తున్న ఒక మదిర మూర్తిని చూసి యిల్లాలు.

తెల్లవారవచ్చే తెలియక నా స్వామి

మళ్ళీ పరుండేవు లేరా! మసులుతూ వుండేవు.

మారాము చాలించలేరా .... అంటూ హెచ్చుస్థాయిలో పాటపాడుతూ కిటికి తెరలు తొలగించింది.

స్వామి కన్ను తెరిచి ఒక క్షణం ఇల్లాలి వంక చూశాడు.

"స్టాప్‌దట్ బ్లడీనాయిస్ లెట్ మి స్లీప్" అంటూ దుప్పటి ముసుగు పెట్టుకుని పడమటి దిక్కు అయ్యాడు. ఇల్లాలు చీకటి ముఖం చేసుకుని వంటింట్లోకి వెళ్ళి పోయింది.

సూర్యభగవానుడు తనలో తాను అనుకున్నట్టు "వుయ్ నీడ్ టోటల్ ప్రొహిబిషన్,నాట్ పర్మిట్స్ అని గొణుకున్నాడు.

గురువుగారు ఆ మండువా యింట్లోకి చూడండి. అంటూ శిష్యుడు హెచ్చరిక చేశాడు.

అది నాలుగు ఇళ్ళచావడి. చాలీచలని కొంప. అందులో పది కాపురాలు. ఎదుట కిటికీ చాటునుంచి తినని వాడి చూపులతో గుచ్చి గుచ్చి చూస్తున్న కాలేజీ కుర్రవాడికి వినపడిలాగా ఒక చివురింటి చిన్నది నల్లటి ముఖం. చీకిరి కళ్ళు, ఎత్తుపళ్ళు వగైరా సుందరి. అపలు జడలో బారెడు సవరం బిగించి జడవేసుకుంటూ ఫుల్ వాల్యూమ్‌లో కూనిరాగంగా కిటికి చాటు చిన్నవాడికి వినపడేలాగా

చిన్నారి నీ సొగసే
వెన్నెలల్లిన చాందిని,
వయ్యారీ ! నీ వలపే
మరుమల్లెలు విరబూసిన
ఘుమ ఘుమ పందిరి! అని
నీ నన్నది విన్నానోయి అది
నిజమోనని తీయని కలలో
వున్నానోయి. !!

కలలు కవిత్వాలు చాలుగాని కాలేజీకి అఘోరించు" అంటూ ఒక నెమలి కంఠం కసిరింది. సవరం వాలుజడగా మారింది. కిటికి తలుపులు మూసుకున్నాయి.

"ప్రేమ పక్షులు లేడీ విలన్" అని సూర్యభగవానుడు అన్నాడు.

దారికి అడ్డంగా నల్లటి మబ్బులు వచ్చాయి. ప్రభాకరుడిని చూడగానే వాయుదేవుడు వరుణ దేముడు పక్కకి వైతొలగారు.

"జగత్ సాక్షి ! జగత్ సాక్షి!" అంటూ అనూరవుడు కేకపెట్టాడు. చేత్తో దూరంగా చూపించాడు, అది సాగర సంగమం - కృష్ణవేణి సాగరంలో కలిసే పవిత్ర ప్రదేశం అది. కాని కూలిపోయిన చెట్లు నేలపాలయిన యిండ్లు సరోవరంలో కలువ పువ్వులలాగా, నీళ్ళల్లో తేలిపోతున్న వేల సంఖ్యలో మానవ మృతశరీరాలు. ఈ క్షణాన్నో మరుక్షణంలోనో ప్రాణాలుపోవటానికి సిద్ధంగా వున్న లక్షలాది జనం.

ఎండ కనిపించగానే "రక్షించు సూర్యనారాయణ ప్రభో కాపాడు తండ్రీ అంటూ మొరపెట్టుకున్నారు.

"ఈ ఎండ పోయేలోగానే ఈ శవాలని దహనం చేయడం మంచిది. మళ్ళీ మబ్బులు' వానవస్తే మనం ఏం చెయ్యలేము" హెల్తు డిపార్టుమెంటువాళ్ళు తొందరపడుతున్నారు.

సూర్యభగవానుడి మనస్సులోంచి నిట్టూర్పు వచ్చింది.

ఈ ఘోరం ఎందుకు జరిగింది.

అని అనూరవుడు గట్టిగానే అడిగాడు.

సూర్యభగవానుడు అనంతంలోకి చెయ్యిచూపిస్తూ కుజస్థంభన నాయనా! అన్నాడు.

మీరేమంటున్నారో నాకు అర్ధ కావటంలేదు.

మిధునంలో గురుడు కర్కాటకంలో కుజుడు సింహంలో శని తిష్టవేసుకుని కూర్చున్నారు. మళ్ళీ సంవత్సరాది వరకు ఇదే పరిస్థితి -

నూట పదమూడు మానవ సంవత్సరాలక్రితం యిలాగే జరిగింది. దారుణమైన ప్రజానాశనం జరిగింది. చెడుకాలం వచ్చేసరికి దేవతలే రాక్షసుల్లాగా ప్రవర్తిస్తారు. మానవకోటికి సహాయం చేయవలసిన వాయువు వరుణడేయింత రాక్షసత్వంగా ప్రవర్తిస్తే బలహీనులు అహంభావులు అయిన మానవులని కాపాడేదెవరు. అని సూర్యుడు అంటూ వుండగానే.

మమ్మల్ని ఏమీ అనకండి. మేము హయ్యర్ అప్స్ దగ్గర నుంచి వచ్చిన అర్డర్సు అనులుపరచే వాళ్ళమే" అంటూ వాళ్ళిద్దరూ ఎదురుగా నిలబడి సమాధానం చెప్పారు.

ఎవరా హయ్యర్ అప్స్.

కైలాసపతిగారు.

ఎంత దారుణమైనవని చేశావయ్యా పరమేశ్వరా! ఇంత ఘాతుకానికి నీ చేతులు ఎలా వచ్చాయి. అని అక్రోశపడుతూ అడిగాడు సూర్యనారాయణమూర్తి.

పరమేశ్వరుడి చిరునవ్వులో మార్పేమీలేదు.

అజ్ఞానంలో పడకు ఆదిత్యా అదుపులో పెట్టలేనంత సృష్టి జరుగుతున్నప్పుడు, అంతులేని లయంకూడా జరగవలసిందే లేకపోతే శాంతి భద్రతలు వుండవు. స్థితి స్థిరంగా వుండదు" అని పరమేశ్వరుడు విడమరిచి చెప్పాడు.

"ఇంతమంది దుర్మరణం" అంటూ సూర్యుడు ఏదో ఫిర్యాదు చెయ్యిబోయాడు.

దుర్మరణం కారునాయనా కొన్ని లక్షల ఆత్మలకు ముక్తి, స్వర్గ ప్రాప్తి, చింతమాని ముందుకు సాగిపో" అంటూ పశుపతినాధుడు అంతర్ధానం అయ్యాడు

.సూర్య రధం ముందుకు సాగింది.

కాలం గడిచింది. పశ్చిమ దిక్కు చేరువయ్యింది. అరేబియా సముద్రంలో అలలు నిశ్చలంగా వున్నాయి.

సూర్యకాంతి వజ్రమై, పుష్యరాగమై, చివరకు ముదురు పగడమై

సాగర స్పర్శతో సూర్యుడికి అలసట తీరి, ప్రాణం లేచివచ్చినట్లు అనిపించింది.

గురువుగారు, గురువుగారు ఒక్క క్షణం ఆగండి అని సారధి హెచ్చరించాడు.

సూర్యుడు ఒక్కసారి సముద్రతీరం వంక చూశాడు. ప్రొద్దువాలిపోయిన ఒక పండు ముదుసలి సూర్యుడికి అంజలి ఘటించి.

పశ్చిమ దిక్కున పగడమయ్యే
ప్రత్యక్ష నారాయణా
నీ పగడాల రంగు మరువలేనయ్యా.
ఎంత చూచినా ఎన్నెన్ని జన్మలు చూసితే
ఈ మనసు నిండేనయ్యా:
మమ్ము వదిలి కనుచాటు కాబోకు
ప్రత్యక్ష నారాయణ " అంటూ పాడుతున్నాడు.

సూర్య భగవానుడు ఒక్కక్షణం చిరునవ్వుగా అతనివంక చూశాడు.

సారధి గడియారం వంక చూసుకుని

"టైమ్ ఫర్ సన్ సెట్టింగు సర్" అని అన్నాడు.

సూర్యుడు పశ్చిమ సాగరంలోకి అస్తమిస్తూ వడ్డునున్న భక్తుడితో మిగతా చరణాలు వినడానికి "రేపు మళ్ళీ వస్తా" అంటూ సాగరంలోకి అదృశ్యమైనాడు.

# సంకల్పం

చాలాసార్లు అనిపించేది ఒక్కసారి ఆ వూరు వెళ్ళివద్దామని

కాని ...

ఎన్నిసార్లు ప్రయత్నంచేసినా ఏదో అనుకోని అవాంతరం రావటం ఆ ప్రయాణం అక్కడకు వాయిదాపడటం జరిగేది.

మనస్సుకి కష్టం వేసేది. పిలచిన వాళ్ళ దగ్గరనుంచి చాలా నిష్టూరాలు వచ్చేవి. నిందలు వచ్చేవి.

రోజులు, వారాలు, నెలలు చివరకు సంవత్సరాలు గడిచాయి.

అయినా ఆ వూరు వెళ్ళడం పడలేదు. కాని ఈసారి వెళ్ళక తప్పలేదు.

ఎందుకంటే, ఆనాటి టపాలో వచ్చిన వుత్తరం వల్ల రెండు విచిత్రమైన విషయాలని తెలిపింది.

మొదటిది ఆ ఉత్తరం స్వామినాధన్ దగ్గరనుంచి రావటం.

రెండవది ఆ ఉత్తరంలో కమలని గురించిన విశేషాలు వుండటం.

ఉత్తరం మొదలుపెట్టడమే నాందీ ప్రస్తావన లేకుండా సాగింది.

"అనుకోకుండా యీవూరు వచ్చాను.

అంతకంటే అనుకోకుండా నీ గరల్ ఫ్రెండ్ కమలని కలుసుకున్నాను.

కలుసుకోకపోతే చాలా సంతోషించే వాడిని. కాని -

సృష్టిలో తీయనిది స్నేహమేనని నాకు తెలుసు -